క్లుప్తంగా

స్వర్ణగిరిలో శ్రావణ పూజలు


ఆలయంలో కుటుంబ సభ్యులతో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బాలసుబ్రహ్మణ్యం

భువనగిరి : పట్టణ శివారులోని స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం శ్రావణ పూజలు నిర్వహించారు. అంతకు ముందు సుప్రభాత సేవ, సువర్ణ బిందె తీర్థం ,తోమాల సేవ, శ్రీ సుదర్శన నరసింహ హవనం, సహస్రనామార్చన, వసంతోత్సవ సేవ నిర్వహించారు. అనంతరం స్వామి వారి నిత్య కల్యాణాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బాలసుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు.

ఆలేరు ఎస్‌ఐ బదిలీ

ఆలేరురూరల్ : ఆలేరు ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న వెంకట శ్రీను శనివారం హైదరాబాద్‌లోని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ విభాగానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో యాదగిరిగుట్ట ఎస్‌ఐగా పని చేస్తున్న ఎం .అనిల్‌ను తాత్కాలికంగా నియమించినట్లు రాచకొండ కమిషనర్ శ్రీధర్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు.

13న విజయోత్సవ ర్యాలీ

భువనగిరిటౌన్ : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తూ ఈ నెల 13న హైదరాబాద్‌లో జరిగే మాదిగల విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెపాక వెంకన్న పిలుపునిచ్చారు. శనివారం భువనగిరిలో నిర్వహించిన ఆ సంఘం ముఖ్య నాయకులు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో కోళ్ల జహంగీర్, ముక్క శ్రీనివాస్, సగ్గు బాబూరావు, దాసరి గోవర్ధన్, పెద్దోళ్ల సమ్మయ్య, యాకుబ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ పోలీసుల సోదాలు


సోదాలు చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

భువనగిరి క్రైం : మండలంలోని ఆకుతోటబావి తండా, పచ్చేర్లబోడు తండాల్లో శనివారం భువనగిరి ఎక్సైజ్ టీమ్ ఆధ్వర్యంలో విస్తృతంగా సోదాలు నిర్వహించారు. సారా తయారు చేసినా, నిల్వ ఉంచినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ నరేందర్ హెచ్చరించారు. సారా తాగడం వల్ల కలిగే అనర్థాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ సోదాల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ బహూకరణ

ఆత్మకూరు(ఎం): మండలంలోని కొరటికల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ. 15వేల విలువ గల మైక్‌సెట్‌ను భువనేశ్వరి గ్రూప్ అధినేత శ్రీరెడ్డి ఆనందనర్సింహస్వామి శనివారం ఆ పాఠశాల హెచ్‌ఎం వెంకన్నకు అందజేశారు. కార్యక్రమంలో కంపెనీ ఫౌండర్ కూరల శ్రీనువాస్, ఎస్ఎస్‌సీ తొలి బ్యాచ్ విద్యార్థి జైపాల్‌రెడ్డి, స్వామి, వర ప్రసాద్, జగత్ సింగ్ పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు భూమి ఆక్రమించారని ఫిర్యాదు

భువనగిరిటౌన్: జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో గల సర్వే నంబర్ 817, 834, 838లోని సుమారు 600గజాల భూమిని ఆక్రమించారని స్థానికులు శనివారం వక్ఫ్‌బోర్డు చైర్మన్ హజ్మతుల్లహ్ హుస్సేనికి ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ హయ్యూమ్ ఖాన్ కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలించారు. సర్వే చేయించి భూమిని స్వాధీనం చేసుకుంటామని తెలిపారు.

యువకుడి అదృశ్యం

గుండాల : యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన గుండాల మండలం వెల్మజాల గ్రామంలో శనివారం వెలుగులోకి వచ్చింది. వెల్మజాల గ్రామానికి చెందిన నల్లమాస భరత్ (32) ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ చౌటుప్పల్‌లో జీవిస్తున్నాడు. భరత్ ఈ నెల 8న ఇంటికి రాగా జీతం మాకు ఎందుకు ఇవ్వడం లేదని తండ్రి ప్రశ్నించాడు. దీంతో భరత్ మనస్తాపంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. అతడి సోదరుడు శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు.

ఆహ్వానపత్రిక అందజేత

చౌటుప్పల్ : మున్సిపాలిటీ పరిధి లక్కారం గ్రామంలోని శ్రీమహంకాలమ్మ, శ్రీముత్యాలమ్మ దేవాలయాల్లో ఆదివారం నుంచి నాలుగు రోజులపాటు నిర్వహించనున్న విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు మత్స్య పారిశ్రామిక సొసైటీ జిల్లా చైర్మన్ పాశం సంజయ్‌బాబు, కౌన్సిలర్ కొయ్యడ సైదులుగౌడ్‌ల ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లిన నిర్వాహకులు ఆహ్వానపత్రిక అందజేశారు. కార్యక్రమంలో లందగిరి భీమయ్య, వెంకటేశం, కుదుములు బస్వారెడ్డి, కానుగు శేఖర్, పాల్గొన్నారు.

తప్పనున్న మూసీ కష్టాలు

- రుద్రవెల్లి- జూలూరు బ్రిడ్జి పనులకు మోక్షం
- త్వరలోనే పూర్తి చేయిస్తామంటున్న అధికారులు
- 40 గ్రామాల ప్రజలకు తీరనున్న ఇబ్బందులు


పిల్లర్లపై కొనసాగుతున్న సెంట్రింగ్ పనులు


శిథిలావస్థలో గల ప్రస్తుత బ్రిడ్జి

బీబీనగర్: బీబీనగర్–పోచంపల్లి మార్గంలో రుద్రవెల్లి- జూలూరు గ్రామాల మధ్య మూసీ నదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు ఎట్టకేలకు పునః ప్రారంభమయ్యాయి. ప్రధాన రహదారిపై గల ఈ మూసీ నదిపై ఇప్పటి వరకు గల బ్రిడ్జి లోలెవల్‌గా ఉండేది. అది కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరి ఇనుప చువ్వలు తేలి ఉండడంతో వర్షాలు కురిసినప్పుడు మూసీ ఉప్పొంగి రాకపోకలు స్తంభించేవి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు బ్రిడ్జి పనులు ప్రారంభం కావడంతో సుమారు 40గ్రామాల ప్రజల రాకపోకల తిప్పలు తప్పనున్నాయి.

ఎనిమిదేళ్లుగా నిలిచిన పనులు

బీబీనగర్–పోచంపల్లి రోడ్డు విస్తరణకు రూ.22కోట్లు, బ్రిడ్జి నిర్మాణానికి రూ.4కోట్ల నిధులను 2014 నవంబర్‌లో అప్పటి ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి మంజూరు చేయించారు. దీంతో 2016 మార్చి 6న బీఆర్ఎస్ ప్రభుత్వంలోని అప్పటి మంత్రి జగదీష్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కాగా భూ నిర్వాసితుల నష్టపరిహారం విషయంలో రైతుల డిమాండ్ మేరకు ప్రభుత్వం ఒప్పుకోకపోవడంతో పనులను అడ్డుకున్నారు. అనంతరం రైతులకు కొంత పరిహారం ఇవ్వగా పనులు ప్రారంభించి పిల్లర్ల దశ వరకు తెగా నిధుల కొరతతో ఎనిమిదేళ్లుగా పనులు నిలిచిపోయాయి. ప్రస్తుత ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి బ్రిడ్జి పనుల పట్ల చొరవ తీసుకొని పనులు ప్రారంభమయ్యేలా చేశారు. ప్రస్తుతం 17పిల్లర్లలో తొమ్మిదింటిని నిర్మించగా మిగిలిన వాటి పనులు చురుగ్గా సాగుతున్నాయి.

300మీటర్ల పొడవుతో..

ప్రభుత్వం నుంచి బ్రిడ్జి నిర్మాణానికి రూ.10.80 కోట్లు నిధులు మంజూరు కాగా 17 పిల్లర్లతో 300మీటర్లకు పైగా పొడవుతో బ్రిడ్జి నిర్మాణం కొనసాగుతుంది. ప్రస్తుతం కొన్ని పిల్లర్ల పూర్తి కావడంతో స్లాబ్ హెర్త్ పనులకు సెంట్రింగ్ వేస్తున్నారు.

త్వరలో బ్రిడ్జి నిర్మాణం పూర్తి

రుద్రవెల్లి- జూలురు గ్రామాల మధ్య మూసీ నదిపై నిర్మిస్తున్న హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో త్వరలో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– ఆర్అండ్‌బీ ఏఈ, లింగయ్య

శ్రీ రేణుక ఎల్లమ్మ, వనం మైసమ్మకు బోనాలు


భూదాన్ పోచంపల్లి మండలం వంకమామిడి గ్రామంలో బోనాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని వంకమామిడి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సురమాంభ సమేత శ్రీ కంఠ మహేశ్వరస్వామి, శ్రీ రేణుకా ఎల్లమ్మ, వనం మైసమ్మ దేవాలయం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలలో భాగంగా శనివారం సాయంత్రం రేణుక ఎల్లమ్మ, వనం మైసమ్మతల్లికి బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. డప్పువాయిద్యాలతో మహిళలు నెత్తిన బోనాలను ఎత్తుకొని ప్రదర్శనగా వచ్చి అమ్మవార్లకు బోనాన్ని నైవేద్యంగా సమర్పించారు. కాగా ఉదయం శ్రీ రేణుకా ఎల్లమ్మ, జమదగ్ని మహామునితో పాటు వనం మైసమ్మతల్లి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. మహిళలు ఒడిబియ్యం పోసుకొన్నారు. అలాగే భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి నిర్వహించిన గౌడ పురాణం వీధినాటకం భక్తులను అలరించింది. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు సుర్వి సత్యనారాయణగౌడ్, మాజీ సర్పంచ్ బొడిగె శంకరయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీ బత్తుల మాధవి శ్రీశైలం గౌడ్, మునుకుంట్ల రామచంద్రం, బొడిగె మల్లయ్య, సుర్వి శివ, సుర్వి రవీందర్, కుమారస్వామి, మల్లేశ్‌గౌడ్, కాసుల శ్రీనివాస్, కుమార్, గణేశ్, బిక్షపతి, బొడిగె శివ, రామశర్మ పాల్గొన్నారు.

వెల్లంకి వాసికి డాక్టరేట్


సిలువేరు శ్వేత

రామన్నపేట : రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన సిలివేరు శ్వేత ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో పరిశోధన చేసి ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ప్రొఫెసర్ నూక శివశంకర్ రెడ్డి పర్యవేక్షణలో పవర్ సర్క్యూట్స్ ఫర్ ఎంబెడెడ్ అండ్ వీఎల్ఎస్ఐ అప్లికేషన్స్ అనే అంశంపై ఆమె పరిశోధన చేశారు. ఈ పరిశోధనాంశంను ప్రతిష్ఠాత్మక సైంటిఫిక్ జర్నల్స్ స్కూపస్, ఎస్‌సీఐలలో ప్రచురించారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేటకు చెందిన పెంటయ్య, అమృతల కుమార్తె అయిన శ్వేత ముత్తంగిలోని ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ (ఈసీఈ), ఉస్మానియా ఇంజనీరింగ్ కళాశాలలో పీజీ(ఎంఈ) పూర్తి చేశారు. వెల్లంకి గ్రామానికి చెందిన వనం సత్తయ్య-యాదమ్మల కుమారుడైన రవీందర్‌తో వివాహం జరిగింది. వివాహం అనంతరం ఆమె పీజీ చదివారు. ప్రస్తుతం ఆమె ఇబ్రహీంపట్నంలోని సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు.

సీపీఎం నాయకుడి స్మారకస్థూపం ఆవిష్కరణ


శ్రీనివాస్ స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న చెరుపల్లి సీతారాములు, నాయకులు

రామన్నపేట : సీపీఎం నాయకుడు పిట్టల శ్రీనివాస్ అందించిన సేవలు మరువలేనివని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఇటీవల మృతిచెందిన సీపీఎం పట్టణ నాయకుడు శ్రీనివాస్ స్మారకస్థూపం ఆవిష్కరించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ తరఫున 50వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పైళ్ల ఆశయ్య, మేక అశోక్‌రెడ్డి, జెల్లెల పెంటయ్య, బొడ్డుపల్లి వెంకటేశం, గాదె నరేందర్, ఎం .వెంకట్‌రెడ్డి, గొరిగె సోములు, కె.నర్సింహాచారి, కందుల హన్మంత్, బి.బాలరాజు, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి ఏర్పాటు చేయాలని ఆందోళన


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న నాయకులు

మోత్కూరు : మోత్కూరులో 30పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని బీసీ రిజర్వేషన్ల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో స్థానిక శ్రీకాంతాచారి చౌరస్తా వద్ద ప్లకార్డులతో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ సరైన వైద్య సేవలు అందక పేదలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మోత్కూరులో ఆస్పత్రి ఏర్పాటు చేస్తే పలు మండలాల ప్రజలకు వైద్య సేవలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు బయ్యని పిచ్చయ్య, వడకాల దయాకర్, నాయకులు గంజి రాములు, రవీంద్రాచారి, ఉప్పలయ్య, సోమలింగం, బోడ భాస్కర్, భాషయ్య పాల్గొన్నారు.

పాండురంగస్వామి ఆలయంలో సహస్ర నామార్చన


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భూదాన్‌పోచంపల్లి : పట్టణకేంద్రంలోని శ్రీ పాండురంగ స్వామి దేవాలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామివారి మేలుకొలుపు, పాండురంగ స్వామికి సహస్ర నామార్చన, యజ్ఞం, మార్కండేశ్వరస్వామి, సీతారామచంద్రస్వామికి, హనుమాన్‌లకు అభిషేకాలు, భ్రమరాంభదేవికి సహస్ర కుంకుమార్చన చేశారు. సాయంత్రం డప్పువాయిద్యాలు, మహిళల కోలాటాల మధ్య పురవీధుల గుండా స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీ శ్రీనివాస్, మార్కండేశ్వరస్వామి దేవాలయ కమిటీ చైర్మన్ సీత సత్యనారాయణ, భజన మండలి అధ్యక్షుడు చక్రాల నర్సింహ, ఉపాధ్యక్షుడు భారత వెంకటేశం, కార్యదర్శి పుప్పాల నాగేశ్వర్, దోర్నాల శ్రీనాథ్, కొంగరి పండరీనాథ్ పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఆధ్వర్యంలో మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం


నగదు అందజేస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి

భువనగిరి రూరల్ : మండల పరిధిలోని చందుపట్ల, రామచంద్రాపురం పీఏసీఎస్‌ల సభ్యులు చిన్నం స్వామి(65), కోల మహేష్(53) అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతిచెందారు. వారి కుటుంబ సభ్యులకు రూ.30వేల చొప్పున సంఘం డీవీడెండ్ ఫండ్‌నుంచి అధ్యక్షులు మందడి లక్ష్మీనర్సింహారెడ్డి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బల్గూరి మధుసూదన్ రెడ్డి, సుబ్బూరు మహేందర్, భువనగిరి సావి త్రమ్మ, సిబ్బంది సీతఊ దంతూరి నర్సింహ, నల్లమాసు రాములు, గుర్రం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన యాట వేణు(35) కుటుంబానికి నేతాజీ యువజన మండలి సభ్యులు అండగా నిలిచారు. మృతుడి కుటుంబానికి శనివారం రూ. 15వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నేతాజీ యువజన మండలి ప్రధాన కార్యదర్శి ఎలిమినేటి మురళీకృష్ణ, మాజీ అధ్యక్షుడు చెరుకు శ్రీనువాస్, సభ్యులు దొంతర బోయిన మురళీకృష్ణ, పైళ్ళ దామోధర్‌రెడ్డి, తవిటి రాజు, ఎలగందుల మహేష్, చిత్తార్ల అనిల్, యాస మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ అమలు చేయాలి


మాట్లాడుతున్న సూదగాని హరిశంకర్ గౌడ్

ఆత్మకూరు(ఎం): షరతులు లేకుండా రుణమాఫీ అమలు చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు హరిశంకర్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు రూ.1.50లక్ష లోపు రుణం మాఫీ కాక రైతులు బ్యాంకులు, వ్యవసాయ శాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. రుణమాఫీ గురించి అధికారులు స్పష్టమైన సమాధానం చెప్పక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. సమావేశంలో ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బీసు చందర్ గౌడ్, నాయకులు కోరె భిక్షపతి, యాస కవిత, కాంబోజు భాను, దేవరపల్లి ప్రవీన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రజకులకు వ్యక్తిగత రుణాలు మంజూరు చేయాలి

బొమ్మలరామారం : రజకులకు వ్యక్తి గత రుణాలు మంజూరు చేసి జీవనోపాధి కల్పించాలని రజక వృత్తిదారుల సంఘం మండల అధ్యక్షుడు ముదిగొండ శ్రీనివాస్ కోరారు. మండలంలోని తూంకుంట గ్రామంలో శనివారం నిర్వహించిన మండల రజక వృత్తిదారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎడిజర్ల భూపాల్, జూపల్లి భరత్, బాల కృష్ణ, మహేష్, అనిల్, జంగయ్య, గణేష్, లింగయ్య, పాపులు,భూములు,నగేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

కళాశాల అటెండర్‌కు ఘనంగా వీడ్కోలు


ఫరీద్‌ను సన్మానిస్తున్న క్రీడాకారులు

మోత్కూరు : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సుదీర్ఘకాలం అటెండర్‌గా పని చేసి బదిలీపై వెళ్లిన ఫరీద్‌ను శనివారం కళాశాల ఆవరణలో షటిల్ క్లబ్ క్రీడాకారులు, పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. షటిల్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ కొత్తపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సుమారు మూడు దశాబ్దాల పాటు కళాశాల అటెండర్‌గా ఫరీద్ అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. షటిల్ క్లబ్ అధ్యక్షుడు ఎలిమినేటి జహంగీర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి మద్ది సోమేశ్వర్, కోశాధికారి బయ్యని నర్సింహ, పూర్వ విద్యార్థులు, క్రీడాకారులు జినుక సైదులు, బరిగెల రామచంద్రు, గనగాని నర్సింహ, మర్రి అనిల్‌కుమార్, కాపర్తి సైమన్, గంధమల్ల సుమన్, పోచం ఉపేందర్, అనబత్తుల వెంకన్న, మందుల కృష్ణ, శివ, చారి పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా యాత్ర


లింగోజిగూడెంలో సుభాష్‌చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేస్తున్న బీజేపీ నాయకులు

చౌటుప్పల్ : ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు బీజేపీ ఆధ్వర్యంలో శనివారం మున్సిపాలిటీ పరిధిలో హర్‌ఘర్ తిరంగా యాత్ర నిర్వహించారు. అందులో భాగంగా గ్రామంలోని సుభాష్‌చంద్రబోస్ విగ్రహాన్ని శుద్ధి చేశారు. పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, మున్సిపాలిటీ, మండల అధ్యక్షుడు కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, చినుకని మల్లేష్, నాయకులు దాసోజు భిక్షమాచారి, ఊడుగు వెంకటేశం, కట్ట కృష్ణ, మిర్యాల రవి, కడారి అయిలయ్య, కొండాపురం దుర్గయ్య, పర్నె అంజిరెడ్డి, బాతరాజు ప్రవీణ్, లింగస్వామి, శ్రీను, గణేష్, శివశంకర్ పాల్గొన్నారు.

వలిగొండ : మండల కేంద్రంతోపాటు మండలంలోని వివిధ గ్రామాలలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే హర్ ఘర్ తిరంగా యాత్రను విజయవంతం చేయాలని బీజేవైఎం జిల్లా కార్యదర్శి మేకల పాండు అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బోళ్ల సుదర్శన్, లోడ లింగస్వామి, మందుల నాగరాజు, మందడి రంజిత్ రెడ్డి, రేగురి అమరేందర్, బుంగమట్ల మహేష్, మైసొల్ల హరీష్, ఆమనగంటి శివ, శివరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం: బీజేపీ ఆధ్వర్యంలో శనివారం సంస్థాన్ నారాయణపురంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. నేతాజీ, భగత్‌సింగ్ విగ్రహాలను శుభ్రం చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సుర్వి రాజుగౌడ్, దోనూరి వీరారెడ్డి, బచ్చనబోయిన దేవందర్, వంగరి రఘు, జక్కర్తి భిక్షం, కిరణ్, శ్రీను, లక్ష్మి, వెంకటేశం, గిరిబాబు, బీరప్ప, శ్రీను, బాలరాజు తదితరులున్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి జన్మదిన వేడుకలు


ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు ర్యాకల శ్రీనివాస్, తదితరులు

భువనగిరి : భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ పార్టీ పట్టణ, మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జగ్జీవన్ రామ్ చౌరస్తా వద్ద కేట్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. అనంతరం బాణసంచా కాల్చారు. అంతకు ముందు స్థానిక కుమ్మరివాడలోని గణపతి దేవాలయంలో పూజలు, జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్స్ పంపిణీ, రైతు బజార్‌కు ఎదురుగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ డాక్టర్ జడల అమరేందర్, జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ కన్వీనర్ కోల్పుల అమరేందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ అంజనేయులు, కిష్టయ్య, పార్టీ పట్టణ, మండల కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ కిరణ్‌కుమార్, జిల్లా నాయకుడు ర్యాకల శ్రీనివాస్, జనగాం పాండు, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బీరు మల్లయ్య, కౌన్సిలర్లు ఖాజీ అజీమొద్దీన్, దిడ్డికాడి భగత్, స్వామి, నాయకులు గోపాల్,సత్తిరెడ్డి, రమేష్, మల్లయ్య, పాండు, రఘునందన్, రాజశేఖర్, లక్ష్మణ్, ఇస్మాయిల్, పద్మ, పావని పాల్గొన్నారు.

అనారోగ్య బాధితులకు చెక్కులు అందజేత



భువనగిరి : చెక్కులు అందజేస్తున్న పాశం భాస్కర్

భువనగిరి : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చొరవతో అనారోగ్య బాధితులకు తెలంగాణ స్టేట్ ఫైనాన్సియల్ అసెస్టెన్స్ నుంచి మంజూరైన చెక్కులను శనివారం బీజేపీ జిల్లా కార్యాలయంలో పంపిణీ చేశారు. ఇందులో జిల్లాలోని ఆలేరు పట్టణంలోని రాంశివాజీ నగర్ కాలనీకి చెందిన మహ్మద్ జావెద్, మోత్కూర్ మండలం రాగిబావికి చెందిన వినోద్, పోచంపల్లి మండలం దోతిగూడెం గ్రామానికి చెందిన నాగరాజు, చౌటుప్పల్ మండలం లింగారెడ్డిగూడేనికి చెందిన మల్లారెడ్డిలు ఉన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్ గుప్తా, కార్యదర్శి వైజయంతి, జిల్లా అధికార ప్రతినిధి ఆకుతోట రామకృష్ణ రాధారపు మల్లేశం, పిన్నింటి నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

రామన్నపేట : మండలంలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం శనివారం తన క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఆపదలో ఉన్న ప్రతీ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, నాయకులు గంగుల వెంకటరాజిరెడ్డి, బత్తుల కృష్ణగౌడ్, గోదాసు పృథ్వీరాజ్, గుత్తా నర్సిరెడ్డి, పూస బాలనర్సింహ, ఎండీ జమీరొద్దిన్, ఎండీ అక్రం పాల్గొన్నారు.

మోత్కూరు : తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం మోత్కూరు మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు గౌడ్, కౌన్సిలర్ పురుగుల వెంకన్న, మాజీ సర్పంచ్ ఎర్రబెల్లి యాదయ్య, కాంగ్రెస్ నాయకులు అవిశెట్టి అవిలుమల్లు, మందుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి


ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న లింగోజిగూడెం గ్రామస్తులు

చౌటుప్పల్ : మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామంలో నెలకొన్న సాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు, రైతులు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. నీటి కొరత కారణంగా వరిపంట నారుమళ్లు ఎండిపోతున్నాయని తెలిపారు. రైతుల పంటలను కాపాడాలంటే సమీపంలోని పిలాయిపల్లి కాలువ నుంచి మూసీ నీటిని మళ్లించాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో కౌన్సిలర్ బండమీది మల్లేష్ తదితరులు ఉన్నారు.

బీమా సౌకర్యం కల్పించాలి

బొమ్మలరామారం : అసంఘటిత రంగ కార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి వెంకటేష్ కోరారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో భారతమ్మ, సాయిలు పాల్గొన్నారు.

స్కూల్ పేరెంట్స్ కమిటీ ఎన్నిక

అడ్డగూడూరు: మండలంలోని గురుకుల పాఠశాల పేరెంట్స్ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మందుల కిరణ్, ప్రధాన కార్యదర్శిగా సిర్పంగి బాలకృష్ణ, ఉపాధ్యక్షుడిగా డప్పు యాదగిరి, కార్యదర్శిగా కూరపాటి సుమలతతో పాటు పలువురు సభ్యులను ఎన్నుకున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఆత్మకూరు(ఎం): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ సైదులు సూచించారు. శనివారం మండలంలోని కప్రాయపల్లిలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శ్రీనువాస్, ప్రేమలత పాల్గొన్నారు.

రోడ్లపై పశువులు.. వాహనదారుల ఇక్కట్లు


భువనగిరి పట్టణంలో రోడ్డుపై తిరుగుతున్న పశువులు

భువనగిరిటౌన్ : జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపైకి పశువులు వస్తుండడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భువనగిరి పట్టణంలో రద్దీగా ఉండే రహదారిపై గేదెలు, ఆవులు ఎక్కడపడితే అక్కడ నిలిచి ఉండటంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మున్సిపల్, పోలీసు అధికారులు చర్యలు తీసుకుని ప్రమాదాలను నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.